

- పరస్పరం మంచి కోరుకునే వారే అసలైన స్నేహితులు
- కష్టాల్లో గుర్తుకు వచ్చే మొదటి వ్యక్తి స్నేహితుడే..
- దోస్తానపై సోషల్ మీడియా తీవ్ర ప్రభావం
- సాంకేతికత పెరిగిన తరువాత తగ్గుతున్న స్నేహబంధాలు
- చాటింగ్స్, స్టేటస్‌లతో స్నేహానికి డిజిటల్ సంకెళ్లు
- సహాయం చేస్తే గుర్తుండిపోతారు.. లేదంటే మర్చిపోతారు..
- కొందరి బంధం మాత్రం.. అవసరాలకు అతీతం..
- నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం
- మారుతున్న స్నేహం తీరుపై ఉమ్మడి జిల్లాలో ఆంధ్రజ్యోతి సర్వే

కాలమెంత మారుతున్నా స్నేహబంధం ఎప్పటికీ గొప్పదే..

గుండె నిండా.. ఉండు ఫ్రెండు!

"స్నేహమంటే.. బుడి బుడి అడుగుల బాల్యంలో పరిచయమైన మరొక బంధం.. బడిలో బలపం పంచుకున్నప్పుడు ఏర్పడిన సంబంధం.. అక్షరాలు నేర్చుకునేటప్పుడు ఆసరాగా నిలిచిన అనుబంధం ఆటలు ఆడుతున్నప్పుడు అల్లుకున్న ఆత్మీయ బంధం కష్టసుఖాల్లో నేనున్నాంటూ భరోసాగా నిలిచే స్నేహబంధం"

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ప్రతీ ఏటా ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ ఏడాది కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఫ్రెండ్‌షిప్‌డే నిర్వహించుకునేందుకు అన్నివర్గాల ప్రజలు, ముఖ్యంగా యువ తరం ఏర్పాట్లు చేసుకుంటోంది. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆంధ్రజ్యోతి నిర్వహించిన సర్వేలో పలువురి యువతీ యువకుల తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

స్నేహితుడంటే..

ఒకప్పుడు స్నేహం అంటే సంతోషాలను, బాధలను పంచుకునే బంధం. ఒకరికి కష్టం వస్తే.. మరొకరు తనకే వచ్చినట్లుగా భావించే కాలం. స్కూల్ డేస్‌లో లంచ్ బాక్స్ పంచుకుని తినడం, ప్రశ్నలకు సమాధానం చెప్పలేక టీచర్ ఎదుట కలిసి నిలబడటం.. ఇలా స్నేహం ఇద్దరినీ ఒకటిగా నిలిపేది. కానీ, ఈరోజుల్లో ఒకరి నొకరు బెస్ట్‌ఫ్రెండ్‌గా పిలుచుకుంటున్నప్పటికీ వారిద్దరి మధ్య బంధం డిజిటల్ డివైజ్‌లకు పరిమితం అవుతోంది. చాట్స్, స్టేటస్ లైక్స్ ఫొటో ట్యాగ్స్. ఇవే స్నేహానికి ప్రమాణాలుగా మారాయి.

కొందరి విషయాల్లో ముఖానికి చిరునవ్వుతో సెల్ఫీ తీయటం ఒకవైపు.. మనసులో అసూయ, నకిలీ మాటలు మరో వైపు.. ఇతరుల బాధలకు చలించాల్సిన మనసులు ఇప్పుడు 'అది నాకేందుకులే..' అనే దూరపు ప్రశ్నను వేసే స్థాయికి ఆలోచనలు వెళుతున్నాయి. ఇంకొందరి విషయాల్లో అవసరం ఉన్నప్పుడు మాత్రమే స్నేహితుడి నెంబరు డయల్ అవుతుంది. మన తప్పులను దాచుకోవడానికో.. ఒంటరితనం తీర్చుకోవడానికో.. వాడే వ్యవస్థలా మారుతుంది ఈ స్నేహబంధం. అయితే వ్యవస్థలో స్నేహం మొత్తం స్వార్థమే అనలేం. ఇంకా కొందరు మిగిలే ఉన్నారు. స్వార్థం లేకుండా, మాట ఇచ్చినట్లే నిలబడి.. కష్ట సమయంలో పక్కన నిలిచేవారు. నిజమైన స్నేహం ఇంకా ఉందని, అది అంతమయ్యేది కాదని చాటేవారు. కానీ, అలాంటి వారు చాలా అరుదే. నిజమైన స్నేహితుడిగా ఎలా ఉండాలో మనల్ని మనమే అడిగే రోజు కావాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అవసరాలకు మాత్రమే గుర్తొచ్చే స్నేహాలు.. అవసరం ముగిసిన వెంటనే మరిచిపోయే బంధాలు నిజమైన స్నేహాలు కావనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఫ్రెండ్‌షిప్‌డే ఒక తాత్కాలిక సంబరం కాకుండా.. మన జీవితాల్లో ఒక అర్థవంతమైన ప్రయాణంగా మారాలని ఆంధ్రజ్యోతి సర్వేలో పలువురు తేల్చిచెప్పారు.

స్నేహితుడే భరోసా..

స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆరు ప్రశ్నలు అడుగగా, ఒక్కొక్క ప్రశ్నకు మూడు ఆప్షన్ ఇచ్చాం. ఇందులో ప్రధానంగా మీరు కష్టాల్లో ఉన్నప్పుడు ముందుగా గుర్తుకు వచ్చే వ్యక్తి ఎవరని అడిగిన ప్రశ్నకు 56.5శాతం మంది స్నేహితుడే అపద్బాంధవుడని తేల్చి చెప్పారు. కష్టాల్లో తోడు ఉండే వ్యక్తి మిత్రుడేనని పేర్కొన్నారు. ఆ తరువాత కుటుంబసభ్యులుగా 38శాతం మంది పేర్కొనగా, ఈ ఇద్దరు కాదు మరొకరు ఉన్నారంటూ 32.5 శాతం మంది పేర్కొనటం గమనార్హం. అలాగే మీ స్నేహితులలో

(మిగతా 7లో...)

ఆంధ్రజ్యోతి సర్వే

సర్వే ఇలా : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన సర్వేలో స్నేహంపై భిన్న వర్గాల వారు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. వారి మాటలు మారుతున్న కాలానికి ప్రతిబింబంగా కనిపించాయి. ఒక్కొక్కరిని 6 ప్రశ్నలు అడగగా, వారు నిర్మొహమాటంగా స్పందించారు. ఏ ప్రశ్నకు ఎలా జవాబులు ఇచ్చారో శాతాల వారీగా ఇలా వున్నాయి...

మీ జీవితంలో నిజమైన స్నేహితుడిని కలిశారా..?	
ఏ). అవును	(56.5శాతం)
బీ). లేదు	(18శాతం)
సీ). చెప్పలేం	(25.5శాతం)

మీ స్నేహితుల్లో కొందరు అవసరానికి మాత్రమే గుర్తు చేసుకుంటారని అనిపించిందా..?	
ఏ). చాలాసార్లు	(51శాతం)
బీ). కొన్ని సార్లు	(33.5శాతం)
సీ). ఆ ఆలోచనే రాలేదు	(15.5శాతం)

మీకు అవసరం లేకపోయినా, రెగ్యులర్‌గా మాట్లాడే స్నేహితులు ఎంతమంది..?	
ఏ). ఎవరూ లేరు	(18శాతం)
బీ). ఒకరిద్దరు	(42.5శాతం)
సీ). ముగ్గురికి పైగా	(25.5శాతం)

మీరు కష్టాల్లో ఉన్నప్పుడు ముందుగా గుర్తుకు వచ్చే వ్యక్తి ఎవరు..?	
ఏ). స్నేహితుడు	(56.5శాతం)
బీ). కుటుంబ సభ్యుడు	(38శాతం)
సీ). ఇద్దరు కాదు	(32.5శాతం)

మీరు స్నేహితులతో ఎక్కువగా ఎలా మాట్లాడతారు..?	
ఏ). ఫోన్ కాల్	(41.5శాతం)
బీ). మెసేజ్ / చాట్	(23శాతం)
సీ). ప్రత్యక్షంగా కలవడం	(35.5శాతం)

సోషల్ మీడియా వల్ల మీరు నిజమైన స్నేహితులను పొందారా లేక కోల్పోయారా?	
ఏ). పొందాను	(40శాతం)
బీ). కోల్పోయాను	(31.5శాతం)
సీ). రెండు జరిగాయి	(25.5శాతం)

స్నేహం అనేది గొప్ప బహుమతి

ప్రొఫెసర్ పృథ్వీ, నిట్ వరంగల్



నిజ జీవితంలో ధనిక, పేద అనే తేడా లేకుండా కష్టసుఖాల్లో, మంచి, చెడు విషయాల్లో ధైర్యం చెబుతూ.. తోడుండేవారే స్నేహితులు. దుఖంలో ఉన్నప్పుడు మన భుజం తట్టి.. నేనున్నాను అని భరోసా కలిగించి, ప్రతిరోజు పలకరిస్తూ, మనల్ని నవ్వించేవారే నిజమైన స్నేహితులు. మంచి స్నేహాలను ఎప్పుడు దూరం చేసుకోవద్దు. చెడుస్నేహాలను ఎప్పుడు దగ్గరికి తీసుకోవద్దు.

నా స్నేహితురాలికి అస్పత్రిలో సేవలు చేశా..

కొమ్ముల సహారా, విద్యార్థిని, జనగామ



స్నేహం అంటే స్వార్థం లేని ఒక అద్భుతమైనబంధం. కష్టాల్లో, సంతోషాల్లో మనతో ఉండేదే స్నేహం. కుటుంబ సభ్యులు తోడుగా లేని సమయంలో ఆలోటు తీర్చేది స్నేహితులే. నా స్నేహితురాలు అనారోగ్యంతో అస్పత్రిలో చేరితే తాను కోలుకునే వరకు దగ్గరుండి సేవలు అందించాను. తనకి ఎవరూ అందుబాటులో లేకపోవటంతో నేనే అన్ని పనులు చేస్తూ.. తాను కోలుకునే వరకు ఉంటే ఉన్నాను. నా స్నేహితురాలికి సేవ చేయటం నా అదృష్టంగా భావిస్తా.

అన్ని బంధాలోకెల్లా స్నేహబంధం గొప్పది

అంబటి అరుణ్‌కుమార్, మహబూబాబాద్



అన్ని బందాల్లోకెల్లా స్నేహ బంధం గొప్పది. చిన్నతనంలో పాఠశాలలో చేరిన సమయంలో కలిసిన స్నేహాలు చిరకాలం కొనసాగుతాయి. తోటి స్నేహితుడికి ఏ ఆపద వచ్చినా క్షణాల్లో అక్కడికి చేరడమే నిజమైన స్నేహం. జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలు, బాధలను నివృత్తి చేసుకునే ఏకైక వ్యక్తి స్నేహితుడు. భవిష్యత్తుకోసం తీసుకునే నిర్ణయాలను కూడా కుటుంబసభ్యులతో కంటే స్నేహితుడికి చెప్పి నిర్ణయం తీసుకుంటాం. జీవితంలో అతిగొప్ప వ్యక్తి స్నేహితుడే.

విద్యార్థి జీవితానికి స్నేహితులే కీలకం

గుర్రం శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, హనుమకొండ



విద్యార్థుల జీవితానికి స్నేహితులు వెన్నుముక లాంటివారు. స్నేహితులు పక్కనుంటే బాల్యంలో ఒత్తిడి తేలిక అవుతుంది. విజయం చేరవవుతుంది. మంచి మిత్రుడు ఇంకో మిత్రుడి జీవితాన్ని మార్చగలరు. ఉరుకుల, పరుగుల జీవితంలో స్నేహితులను కలుసుకునే సమయం దొరకటం లేదు. వాట్సాప్ గ్రూపుల్లో పలకరింపులే మిగులుతున్నాయి. ఎన్ని బంధాలు ఉన్నప్పటికీ స్నేహబంధాన్ని మించినవి కావు. కష్టసుఖాల్లో తోడుగా నిలిచినవారే నిజమైన స్నేహితులు.



విద్యార్థినులకు కారంతో బ్రేక్‌ఫాస్ట్

- పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టలేని కాంగ్రెస్ సర్కార్
- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ ఆగ్రహం

మహబూబాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పిల్లలకు కారంతో బ్రేక్‌ఫాస్ట్ పెట్టడమేంటని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందించే అల్పాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రోజు దిన పత్రికల్లో, టీవీల్లో గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆస్పత్రి పాలైన వార్తలు చూడాల్సి వస్తోందని, ఐనా ప్రభుత్వంలో మార్పు లేదన్నారు. హాస్టళ్లు, గురుకులాల్లో ముద్దల అన్నం తినలేక ఖాళీ కడుపులతో పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కనీసం గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. అనేక మంది విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పట్టింపు లేదన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ పెడుతామని డబ్బా కొట్టిన సీఎం రేవంత్‌రెడ్డి, రెండు సంవత్సరాల్లో ఒక ఇటుక పెట్టి స్కూల్ కట్టింది లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ 284 ఉన్న గురుకులాలను 1,023 గురుకులాలకు పెంచి 6 లక్షల మంది విద్యార్థులు చదువుకునేలా సౌకర్యాలు కల్పించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా గురుకులాలపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు.



వంటను పరిశీలిస్తున్న సత్యవతిరాథోడ్



ప్లేట్‌లో కారంతో ఉన్న అల్పాహారం

బీసీలకు 42శాతం రిజర్వేషన్ డిమాండ్‌తో దీక్ష

మానుకోటలో వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్‌తో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద జరుపతలపెట్టిన 72గంటల రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయాలని యునైటెడ్ ఫూలే ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ గొరిగె నర్సింహా, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గందసరి వేణు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో దీక్ష వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి 42శాతం రిజర్వేషన్‌ను ఆమోదించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో ఈ నెల 4,5,6,7 తేదీల్లో ఇందిరాపార్కు వద్ద జరిగే 72 గంటల దీక్షకు బీసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సత్తా చాటాలన్నారు. బీసీ రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్, బీజేపీలు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. బీసీ బిల్లు పెట్టకుంటే కేంద్రం ప్రభుత్వంపై మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగెం హర్షిత్, గోపు సదానంద్, సతీష్, శ్రీనివాస్, కర్ణాకర్, గిరగాని శ్యామ్, ధర్మారపు పవన్, పేర్ల గణేష్, ములకల నరేష్, రాజేష్, వేణు, ప్రసాద్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యునైటెడ్ ఫూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నేతలు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తినాయక్



మాట్లాడుతున్న గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తినాయక్

గూడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కాంగ్రెస్ గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తినాయక్ అన్నారు. గూడూరులో సీపీఐ అనుబంధ గిరిజన సమాఖ్య మహబూబాబాద్ జిల్లా ద్వితీయ మహాసభ నిర్వహించారు. తొలుత అంగడి సెంటర్ నుంచి కన్యకాపరమేశ్వరి ఫంక్షన్‌హాల్ వరకు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభకు లావుడ్య రామునాయక్, బాదావత్ పద్మలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తినాయక్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్కరోజు కూడా గిరిజనుల అభివృద్ధి పట్టించుకోలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కాళేశ్వరం నిర్మాణానికి మళ్లించారని పేర్కొన్నారు. గిరిజనులకు ట్రైకార్ రుణాలను అందించడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలం చెందాయని ఆరోపించారు. 33 గిరిజన తెగల అభివృద్ధి కోసం గిరిజన సమాఖ్య ఉద్యమిస్తుందని చెప్పారు. ఈ మహాసభలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, మాజీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు తుకారంనాయక్, దేవేందర్, హర్లానాయక్, భావ్‌సింగ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లావుడ్య రామునాయక్, మాలోతు రవీందర్, మాలోతు లింగ్యానాయక్, యాక్యానాయక్, మల్లయ్య, సాయి, బిచ్చా, జగన్నాథం, రామ్మూర్తి పాల్గొన్నారు.

సాగు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

8

అమ్మా బైలెల్లినాదో..

- నేటి నుంచి బోనాల పండుగ షురూ
- జిల్లా వ్యాప్తంగా ప్రారంభం
- బుధ, ఆదివారాల్లో మొక్కులు చెల్లించనున్న భక్తులు
- ముస్తాబైన ముత్యాలమ్మతల్లి ఆలయాలు



మహబూబాబాద్ కొత్త బజారులోని బోనాల వేడుకలకు ముస్తాబైన ముత్యాలమ్మ తల్లి దేవాలయం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి బోనాల పండుగ ప్రారంభం కానుంది. ముత్యాలమ్మ తల్లికి బోనాలు చెల్లించేందుకు ఆలయాలను సుందరీకరించారు. ఏటా శ్రావణమాసంలో ఊరూరా కుల, మతాలకు అతీతంగా పిల్లాపాపలతో గ్రామీణ దేవతలకు బోనాలతో మొక్కులు చెల్లించుకుని, ప్రత్యేక పూజలు చేస్తారు. అందులో భాగంగానే ఆలయ పూజారులు, కమిటీల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయాలను సందరీకరించి విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ప్రతీ అమ్మవారి ఆలయం ఎదుట వినిపించే బోనాల పాటలు, జానపద క్రీడకథలు, పిల్లలను ఆకర్షించే ఆటవస్తువస్తువుల షాపులను ఏర్పాటు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని కోరుతూ బోనాలను అమ్మవారికి నైవేధ్యంగా పెడతారు. తరతరాలుగా ఈ పండుగ ఆచారం కొనసాగుతోంది. పోలేరమ్మ, పోచ మ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ, నాంచారమ్మ, ఉప్పలమ్మ, కోటమైసమ్మ, పెద్దమ్మతల్లి, ఎల్లమ్మతల్లి ఇలా రకరకాల పేర్లతో వెలిసిన గ్రామదేవతలను ఈ పర్వదినాన పూజిస్తారు. భక్తులు కుమ్మరి ఇంటి నుంచి కొత్తకుండను తెచ్చి కుండ అడుగు భాగం, పైభాగంలో

బోనం అంటే..

పర్వదినం తెల్లవారుజామున అమ్మవారికి బోనం తయారు చేస్తారు. పసుపు కలిపిన అన్నంతో అమ్మవారికి బోనం తయారు చేస్తారు. బోనంపైన దీపం పెట్టుకుని వేపాకు, కుంకుమ, పసుపుతో కుండను అలంకరించి మరో చేతిలో అమ్మవారికి సాకపోయడానికి నీరు తీసుకుని మహిళలు దేవాలయానికి వస్తారు. అమ్మవారి ముందుగా ఆలయంలో సానపోసి బోనంలోని పసుపు అన్నం సమర్పించి అమ్మవారి దర్శనం చేసుకుంటారు.

ఘట్టం..

అమ్మవారి ఆకారంలో అలంకరించిన రాగి కలశాన్ని ఘట్టం అంటారు. పూజారి ఒంటికి పసుపు రాసుకుని ఈ ఘట్టాన్ని మోస్తారు. పండుగ మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ఈ ఘట్టాన్ని భక్తుల మేళవాయిద్యాల నడుమ ఊరేగిస్తారు. బోనాన్ని నెత్తిన పెట్టుకుని నృత్యాలు చేస్తూ అమ్మవార్లకు బోనాలు చెల్లించి, పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

ఎలాంటి కీడు దరిచేరనీయదు..

బొడ్డుపల్లి కొమురమ్మ, పూజారి, పాతబజారు ముత్యాలమ్మ తల్లి ఆలయం, మానుకోట



ప్రతీ శ్రావణమాసంలో అమ్మవారికి బోనాలు చెల్లించడం ద్వారా వాతావరణ మార్పుల వల్ల ప్రబలే అంటువ్యాధులు, ఇతర దుష్టశక్తుల నుంచి వచ్చే కీడులను అమ్మవారు దరిచేరనీయదు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో, ప్రజలు సుఖసంతోషాలతో ఉండే విధంగా తల్లి కరుణ చూపాలని భక్తులు బోనాలతో మొక్కులు చెల్లించుకుంటారు.

మానుకోట జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు

● గవర్నర్ చేతుల మీదుగా అందుకున్న అదనపు కలెక్టర్



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాన్ని సాధించినందుకు గాను మహబూబాబాద్ జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. 2024 సంవత్సరంలో జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో నిర్వహించిన సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో మొదటి త్రైమాసికంలో ఏఎన్‌సీ కోసం వంద శాతం గర్భిణుల నమోదు, డయాబెటిస్ వంద శాతం పరీక్షలు, వంద శాతం ఐసీడీఎస్ కార్యక్రమాల నిర్వహణ, స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు అందించడం, ఏజెన్సీ గంగారం మండలం ఆరు పారా మీటర్లలో ఉత్తమ ప్రతిభ కనపర్చినందుకు గాను రాష్ట్ర స్థాయిలో నీతి అయోగ్ సంస్థ మానుకోట జిల్లాకు సిల్వర్ మెడల్ ప్రకటించింది. హైదరాబాద్ రాజ్‌భవన్‌లోని ప్రజా దర్బార్‌లో శనివారం నిర్వహించిన సంపూర్ణత అభియాన్, సమ్మాన్ సమరోహ్ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా మానుకోట జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ సిల్వర్ మెడల్‌తో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

కేసముద్రం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 8న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ శనివారం తెలిపారు. కళాశాలలో కంప్యూటర్స్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఎలక్ట్రికల్స్(ఈవీ), ఎలక్ట్రానిక్స్(ఈఎంబీ) బ్రాంచిల్లో మిగిలిన సీట్లకు ఈనెల 6 నుంచి 8 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని చెప్పారు. వివరాలకు ప్రిన్సిపాల్ 8977222648 నెంబరులో సంప్రదించాలని కోరారు.

పల్లెల్లో కూలీల కొరత

● పత్తిలో ఏపుగా పెరుగుతున్న కలుపు మొక్కలు
● కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్న రైతులు
● పంటలకు గడ్డి మందు కొడుతున్న వైనం



పత్తిలో కలుపు తీస్తున్న కూలీలు

చిట్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సాగుకు సన్నద్ధమైన రైతులకు ఆదిలోనే ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పత్తి సాగు చేసే రైతులకు పంట చేతికొచ్చేదాక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 93,823 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఇన్నాళ్లు విత్తనాలు మొలకెత్తక, వర్షాలు కురవక ఇబ్బందులు పడిన రైతులకు ఇప్పుడు కొత్త చిక్కు వచ్చి పడింది. పత్తిలో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలుపు మొక్కలను తొలగించేందుకు కూలీలను పిలుద్దామంటే దొరకక నానా యాతన పడుతున్నారు. కలుపును తొలగించకపోతే పత్తి పంటకు చీడపీడలు సోకి ఉన్న మొక్క కాస్త ఎదగకుండా గిడసబారి తీవ్రంగా నష్టాన్ని చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

గడ్డి మందులకు అలవాటు పడుతున్న వైనం..

పిలుద్దామంటే కూలీలు రారు.. వచ్చినా కూలీల పెట్టుబడి అదనపు భారంగా తయారవుతుంది. పంటలో కలుపు ఏపుగా పెరుగుతున్న తరుణంలో రైతులు గడ్డి మందుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే అదనుకు వర్షాలు కురవక నానా యాతన పడి రెండు మూడు సార్లు అంటుమొక్కలు నాటి మొలకలను కాపాడిన రైతులకు గడ్డి పెరగడంతో ఇదో సమస్యగా మారింది. అదనపు భారమైనా భరించి గడ్డి మందులు కొడుతున్నారు. చిట్యాల మండలంలోని ఓ గ్రామంలో రైతు గడ్డి మందు కొట్టడంతో ఉన్న పత్తి పంట కాస్త వాడిపోయింది. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా రైతులు పత్తి పంట చేతికొచ్చే వరకు నానా ఇబ్బందులు పడక తప్పడం లేదు.

ట్రాలీల నుంచి ఇతర ప్రాంతాలకు..

వరినాట్ల సీజన్ కావడంతో మహిళా కూలీలు ఇతర ప్రాంతాలకు ట్రాలీలలో వలస వెళుతున్నారు. పత్తి కలుపునకు చిట్యాలలో రూ.300 ఇస్తే.. వరినాటు వేసే కూలీలకు రూ.500 నుంచి రూ.1500 వరకు చెల్లించడం గమనార్హం.



చిట్యాలలో పత్తి పంటలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

పత్తి సాగులో మెళకువలు అవసరం

పత్తి సాగు చేసే విషయంలో రైతులకు కనీస మెళకువలు నేర్పాల్సిన వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదు.. ఏదో మమ అన్నట్లుగా వారానికో ఊరు, పల్లె తిరగడం, ఫొటోలకు ఫోజులు ఇవ్వడం, కాలం వెళ్లదీయడం పరిపాటిగా మారింది. పత్తిలో కలుపు లేకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం వ్యవసాయాధికారులపై ఉంది.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

కేసముద్రం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం వెంకటగిరిలో శనివారం మల్లారి నర్సమ్మ(55) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ట్రైనీ ఎస్‌ఐ నరేష్ తెలిపారు. నర్సమ్మ ఉదయం తన చెల్క వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను మహబూబాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతురాలికి భర్త లక్ష్మయ్య, కుమారుడు, కూతురు ఉన్నారు. అనారోగ్య కారణాలతో నర్సమ్మ ఆత్మహత్య చేసుకుందని భర్త లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలో వెలిసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వందలాదిగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు చేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో గల ఉప దేవాలయాలను దర్శించుకొని దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపై వెలిసి ఉన్న స్వయంభువు స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు ముక్కమళ్ల రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారి మూల విరాట్‌కు అర్చనాభిషేకాలు చేసి నూతన వస్త్రాలను, గజమాలతో అలంకరించి భక్తులు దైవదర్శనం గావించారు.



రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం సిద్ధం

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



తాడిచర్లలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మల్హర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండల కేంద్రమైన తాడిచర్లలో రూ.40లక్షలతో నిర్మాణం చేపట్టిన పీఏసీఎస్ కార్యాలయం, గోదాం భవనాన్ని, రూ.25లక్షలతో నిర్మాణం చేపట్టిన గ్రంథాలయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. రూ.12లక్షలతో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ ప్రహరీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ కేటగిరికి సంబంధించి రెండు చట్టాలను చేసి అమలు ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి గవర్నర్ ద్వారా ఆమోదం కోసం రాష్ట్రపతి వద్దకు పంపినట్లు తెలిపారు. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఆమోదంతెలుపలేదన్నారు. రిజర్వేషన్ ఆమోదం కోసం ఈనెల 5, 6, 7 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు, ఓబీసీ మిత్రులతో కలిసి జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన గత ప్రభుత్వం ఏనాడూ ఈ ప్రక్రియ చేపట్టలేదని, రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కార్చుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బిల్లు ఆమోదానికి కృషి చేయాలని లేదా తమతో కలిసి రావాలన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సహకార సంఘం కార్యాలయం ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంత రైతులకు బ్యాంకు సేవలు, వ్యవసాయ రుణాల మంజూరు సులభతరం అవుతుందన్నారు. అలాగే బ్యాంకులో లాకర్ల వంటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా ప్రారంభించిన గ్రంథాలయంలో విద్యార్థులు, ప్రజలకు పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియామకమైన దండు రమేష్‌ను మంత్రి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయాధికారి బాబూరావు, తహసీల్దార్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్, డ్రగ్గిస్టల సమస్యల పరిష్కారానికి కృషి

● మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కెమిస్ట్, డ్రగ్గిస్టల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ భవనంలో శనివారం జరిగిన కెమిస్ట్, డ్రగ్గిస్టల జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా పేరాల సంపత్, ప్రధాన కార్యదర్శిగా సోమ పురుషోత్తం, కోశాధికారిగా బెజుగం రాజు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ సంఘం నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులు పనితీరును మెరుగుపరుచుకొని సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో త్వరలో సంఘం నూతన భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. కెమిస్ట్, డ్రగ్గిస్ట్ సంఘం బాధ్యులు అందరితో సమన్వయంగా వ్యవహరిస్తూ సంఘం బలోపేతానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మాదవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద ప్రవాహం

● బ్యారేజీలోకి 2.02 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 1.57 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా, బ్యారేజీ వద్ద నీటిమట్టం 2.80 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది.

కాళేశ్వరానికి పోటెత్తిన భక్తజనం



గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహదేవపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరానికి శ్రావణ శనివారం భక్తజనం పోటెత్తారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. శుభానందదేవి ఆలయంలో కుంకుమార్చన చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మీడియేషన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

● జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మీడియేషన్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం రెవెన్యూ, పోలీస్ అధికారులతో పెండింగ్ కేసుల పరిష్కారంకై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 13న జరిగే జాతీయ లోక్ ఆదాలత్‌లో ఎక్కువ మొత్తంలో కేసులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 90 రోజుల మీడియేషన్ కార్యక్రమంలో కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు

తొర్రూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. శుక్రవారం రాత్రి పట్టణ శివారులో 7గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా సమాచారం మేరకు గుర్తించి వారివద్ద నుంచి రూ.60వేల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పేకాట ఆడడం చట్టవ్యతిరేకమని, పేకాట ఆడేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నల్లబెల్లం విక్రయిస్తే పీడీ యాక్ట్

● గుండెపుడిలో కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న సీఐ రాజ్‌కుమార్ గౌడ్

మరిపెడ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిషేధించిన నల్లబెల్లం విక్రయించినా, నాటుసారాయి తయారు చేసినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని సీఐ రాజ్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. శనివారం గుండెపుడిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్‌లో నంబర్ ప్లేట్, డాక్యుమెంట్ లేని 32 ద్విచక్ర వాహనాలు, రూ.10,500 విలువ గల లిక్కర్ సీసాలు, 3 క్వింటాళ్ల నల్లబెల్లం, 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. గుడుంబా వలన ఎంతో ప్రమాదం ఉందని అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లేడుకు సరిహద్దున ఉన్న ప్రాంతం కావడంతో గుండెపుడికి అక్రమ రవాణా సాగుతుందన్నారు. అక్రమ రవాణా చేసినట్లయితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సీఐ రాజ్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ, చిన్నగూడురు, సీరోలు ఎస్సైలు బొలగాని సతీష్ గౌడ్, ప్రవీణ్‌కుమార్, సంతోష్, 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వారోత్సవాల వేళ అప్రమత్తం

● ముమ్మర తనిఖీలు చేపట్టిన పోలీసులు



చంద్రుపట్ల వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పేరూరు ఎస్సై

వాజేడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల వేళ ఏజెన్సీలో పోలీసులు అప్రమత్తం అవుతున్నారు. రాష్ట్ర సరిహద్దులో హై అలర్ట్ ప్రకటించిన పోలీసులు మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచారు. ఓ వైపు ఆపరేషన్ కగార్ మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ తగలగా ప్రతికారేచ్ఛతో ఎలాంటి విధ్వంసాలకైనా దిగే ఆస్కారం ఉండటంతో ఏజెన్సీలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. శనివారం రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన చంద్రుపట్ల వద్ద పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రాకపోకలు సాగించే వారి వివరాలు సేకరించారు. మావోయిస్టులకు సహకరించే వ్యక్తులపై సైతం పోలీసులు డేగ కన్ను వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మావోయిస్టులకు టార్గెట్‌గా ఉన్న నేతలకు ముందస్తు నోటీసులు జారీ చేసి పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

గుండె నిండా.. ఉండు ఫ్రెండు!

(5వ పేజీ తరువాయి)

కొందరు అవసరానికి మాత్రమే మిమ్ము లను గుర్తు చేసుకుంటారని అనిపించిందా..? అని అడిగిన ప్రశ్నకు కూడా 51శాతం మంది అనిపించిందని అభిప్రాయపడ్డారు. అంటే అవసరం ఉన్నప్పుడే స్నేహితుడు గుర్తుకువస్తాడని, ఆ తరువాత పట్టించుకోరనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఆ తరువాత కొన్ని సార్లు అలా అనిపించిందని 33.5శాతం అభిప్రాయపడగా, అసలు ఆ ఆలోచనే రాలేదని 15.5శాతం మంది అభిప్రాయపడ్డారు. సందర్భం ఏదైనా అవసరానికి ఉపయోగపడే వాడు స్నేహితుడే అని తేల్చిచెప్పారు.

అలాగే దోస్తనాపై సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా పడిందనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. సోషల్‌మీడియా వల్ల మీరు నిజమైన స్నేహితులను పొందారా..? లేక కోల్పోయారా..? అని అడిగిన ప్రశ్నకు 40శాతం మంది నిజమైన స్నేహితులను పొందామని అభిప్రాయ పడగా, కోల్పోయామని 31.5శాతం



మంది, రెండు జరిగాయని 33.5శాతం మంది అభిప్రాయ పడ్డారు. అంటే సోషల్ మీడియా వల్ల మంచి చెడు రెండు ఉన్నాయని తేల్చిచెప్పారు. అలాగే మీరు స్నేహితులతో ఎక్కువగా ఎలా మాట్లాడతారని అడిగిన ప్రశ్నకు 41.5శాతం మంది ఫోన్‌ద్వారానే రెగ్యులర్‌గా మాట్లాడుకుంటామని పేర్కొన్నారు. 35.5శాతం మంది మాత్రం రెగ్యులర్‌గా కలుసుకుంటామని చెప్పగా, 23శాతం మంది మాత్రం చాటింగ్‌లు, మెసేజ్‌ల ద్వారా పలకరించుకుంటామని చెప్పారు. సాంకేతికత పెరిగిన తరువాత మనుషుల మధ్య దూరం పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

మీకు అవసరం లేకపోయినా రెగ్యులర్‌గా మాట్లాడే స్నేహితులు ఎందరు ఉన్నారని అడిగిన ప్రశ్నకు.. ఎవరూ లేరని 25శాతం మంది అభిప్రాయ పడగా, ఒకరిద్దరు ఉన్నారని 42.5శాతం మంది, ముగ్గురికంటే పైనే అని 32.5శాతం మంది చెప్పారు.

మీ జీవితంలో నిజమైన స్నేహితుడిని కలిశారా..? అని అడుగగా, 56.5శాతం మంది కలిశామని తేల్చిచెప్పారు. 36శాతం మంది తమ మనసుకు నచ్చిన అసలైన మిత్రుడు ఇంకా లభించలేదనే అభిప్రాయాన్ని తెలిపారు. అలాంటి మిత్రుడిని కలిశామా..? లేదా..? అని కచ్చితంగా చెప్పలేమని 25.5శాతం మంది తేల్చి చెప్పారు. మొత్తంగా స్నేహితుడిపైనే అధికంగా నమ్మకం, భరోసా, బాధ్యత ఉన్నట్లుగా సర్వేలో అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

కష్ట సమయాల్లో ఓదార్చేది స్నేహితులే..



కష్ట సమయాల్లో ఓదార్పుగా స్నేహితులే ఉంటారు. చాలసార్లు నా స్నేహితులకు నేను సాయం చేశాను. నాకు కూడా నా స్నేహితుల నుంచి సాయం అందింది. బంధువులు తోడు ఉన్నా లేకున్నా.. స్నేహితులు మాత్రం అండగా నిలుస్తారు. కులాలు, మతాలు, వయస్సుతో సంబంధం లేకుండా మంచి స్నేహాలు జీవితానికి భరోసా ఇస్తాయి.

- బజ్జూరి సుహాసిని, సాఫ్ట్‌వేర్‌ఉద్యోగి, కరీమాబాద్

ఆన్‌లైన్ స్నేహాలు ప్రమాదకరం



ఆన్‌లైన్ స్నేహాలకు ఆకర్షితులు కావద్దు. అనేక మోసాలకు ఈ స్నేహాలే కారణం అవుతున్నాయి. అవతలి వారి వ్యక్తిత్వం తెలియక మోసపోవాల్సి వస్తోంది. చిన్నతనం నుంచి మనతో కలిసి ఉన్న ఫ్రెండ్స్‌తో స్నేహం కొనసాగించాలి. మిత్రులకు కష్టం వస్తే అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రతీ ఫ్రెండ్‌పై ఉంటుంది. మంచి స్నేహాలు జీవితాలకు అండగా నిలుస్తాయి. చెడు స్నేహాలను ఎప్పటికీ దగ్గరికి రాకుండా చూసుకోవాలి.

- మేడి చైతన్య, సూపరిండెంటెండ్, ఇరిగేషన్ శాఖ, ములుగు జిల్లా

స్నేహం అంటేనే భరోసా..



అపదలో ఉన్నప్పుడు నిజమైన స్నేహితుల విలువ తెలుస్తుంది. కుటుంబసభ్యులకు కూడా చెప్పలేని విషయాలను స్నేహితులతో పంచుకుంటాం. చిన్ననాటి స్నేహాలు పటిష్టంగా ఉంటాయి. సెల్‌ఫోన్ వినియోగం పెరిగిన తరువాత వృత్తిరీత్యా ఎక్కడెక్కడ ఉన్న కనీసం వారంలో ఒకసారైనా ఫోన్‌లో మాట్లాడుకుంటున్నాం. నా మిత్రులకు చాలామందికి సాయం చేశాను. అవసరమైనప్పుడే వారి నుంచి నాకు కూడా సహాయం లభించింది.

- లక్కాకుల సారంగపాణి, ప్రయివేటు ఉద్యోగి, భూపాలపల్లి

ఎల్లప్పుడూ తోడుండే బంధమే స్నేహం



స్నేహమంటే ఎలాంటి స్వార్థం లేకుండా ఎల్లప్పుడూ తోడుగా నిలిచే బంధం. అది మాటల్లో కంటే మనుసుల్లో నిలిచిపోయే సంబంధమే స్నేహం. నా కుమారుడికి యాక్సిడెంట్ అయి కోమాలో ఉన్నప్పుడు నా మిత్రులు నాకు ఆర్థిక సాయం చేయటమే కాకుండా మనోధైర్యాన్నిచ్చారు. అన్‌లైన్ స్నేహాల పట్ల నేటి యువత జాగ్రత్తగా ఉండాలి. క్షణికావేశంలో ఎవరినీ నమ్మవద్దు. మంచి స్నేహాలు ఎప్పుడు జీవితానికి తోడుగా ఉంటాయి.

- అచ్చ సుదర్శన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, హసన్‌పర్తి

అ'పూర్వ' స్నేహబంధాలు

- ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న క్లాస్‌మేట్స్
- నిజమైన స్నేహానికి అర్థంగా నిలుస్తున్న చిన్న నాటి స్నేహితులు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం అన్న పదాలను నిజం చేస్తున్నారు క్లాస్‌మెట్స్ చిన్నతనంలో విద్యాకేంద్రాలు, సరస్వతి నిలయాల్లో ఏర్పడ్డ స్నేహబంధం కడదాక నిలుస్తోంది. స్నేహితుడు అనారోగ్యం బారిన పడితే తమకు తోచిన సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. అంతే కాదు, స్నేహితుడు దురదృష్టవశాత్తు కానరాని లోకాలకు వెళ్లితే, అతడి కుటుంబ సభ్యులకు బాసటగా ఉంటున్నారు. పాఠశాల స్థాయిలో విద్యాభ్యాసాన్ని ముగించుకుని ఉన్నత చదువుల కోసం దశాబ్దాల కిందట విడిపోయిన పదో తరగతి విద్యార్థులంతా గత కొద్ది కాలంగా వారు చదివిన పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాల (అపూర్వ కలయిక) పేరుతో ఒకే వేదికపై కలుస్తూ స్నేహబంధాలకు బలాన్ని చేకురుస్తున్నారు. సమావేశాల్లో ఒకరి గూర్చి ఒకరు తెలుసుకొని ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నారు. అవసరాలున్న వారిని గుర్తించి మిగతా వారంతా ఆసరాగా నిలుస్తున్నారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు భరోసాగా నిలుస్తున్నారు. కేసముద్రం ఎస్‌వీవీ పాఠశాలలో 1996-97 టెన్త్ బ్యాచ్‌కు చెందిన వెంకటగిరి వాసి గాండ్ల అశోక్, అతని భార్య అనారోగ్యంతో మృతి చెందగా, వారి కూతురు చదువు బాధ్యతను తీసుకుని ఆరేండ్లుగా పాఠశాల ఫీజు చెల్లిస్తూ స్నేహానికి మారుపేరుగా నిలుస్తున్నారు. స్నేహం అంటే కేవలం కలుసుకున్న సమయాల్లో మాట్లాడుకోవడం, సంతోషాల్లో కలవడం కాదు.. ఆపదలో ఉన్న సమయాల్లో తామున్నామంటూ భరోసా నిచ్చేది అని నిరూపిస్తున్నారు క్లాస్‌మేట్స్.



నర్సంపేటలో స్నేహితుడి కుమార్తె స్కూల్ ఫీజు చెల్లిస్తున్న 1996-97 టెన్త్ బ్యాచ్ కేసముద్రం ఎస్‌వీవీ స్కూల్ క్లాస్‌మెట్స్

దేవాదుల మూడో దశ పనులు వెంటనే చేపట్టాలి

మంత్రి ఉత్తమ్‌ను కోరిన ఎమ్మెల్యేలు శ్రీహరి, యశస్వినిరెడ్డి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా చేపట్టిన మూడో దశ పనులు వెంటనే చేపట్టాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో కడియం శ్రీహరి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి దేవాదుల ప్రాజెక్టు గురించి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశ ఆరో ప్యాకేజీలో సవరించిన పనులను వెంటనే చేపడితే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించే ప్రాజెక్టుగా దేవాదుల మారుతుందని పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, పాలకుర్తి, తుంగతుర్తి నియోజకవర్గాల్లో దాదాపు 78 వేల ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. వివిధ కారణాల వల్ల పనుల్లో జాప్యం జరిగిందని, దీంతో ఈ ప్రాంతాలకు సాగునీరు అందలేదని తెలిపారు. ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టులోని పెండింగ్ పనులను పూర్తి చేయాలని మంత్రిని కోరారు. ఉప్పుగల్లు రిజర్వాయర్ నుంచి దంస చెరువు, జఫర్‌గడ్ పెద్ద చెరువు నింపడంతో పాటు 10 వేల ఎకరాలకు సాగు నీరు అందిచవచ్చని తెలిపారు. పాలకుర్తి నియోజక వర్గంలో సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, వీటితో పాటు నెల్లుట్ల చెక్‌డ్యాం, లోతువాగుపైన ఆనకట్ట, ధర్మసాగర్ సౌత్ మెయిన్ కెనాల్‌లో పూడిక తీత పనులను చేపట్టాలని, పామునూరు వద్ద బంజర్ మాటు, ఆకేరు వాగుపైన కొనాయిచలం, తిడుగు గ్రామాల వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు కడియం తెలిపారు. దీనిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖ అధికారులకు త్వరితగతిన పూర్తిచేసి పరిపాలన అనుమతి కోసం పంపించాలని ఆదేశించినట్లు తెలిపారు.

నేడు 'మనసు - మనిషి' వ్యక్తిత్వ వికాస పుస్తకావిష్కరణ

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సైకాలజిస్టు, కౌన్సెలింగ్ ఎక్స్‌పర్ట్, పీజీ హెచ్‌ఎం మెండు ఉమామహేశ్వర రచించిన మనసు - మనిషి వ్యక్తిత్వ వికాస పుస్తకం ఆవిష్కరణ ఆదివారం ఉదయం 10గంటలకు హనుమకొండ కిషన్‌పురాలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ అద్యక్షుడు దాసరి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, గౌరవ అతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన వక్తగా సీనియర్ పాత్రికేయుడు కెంకేసి శంకర్‌రావు, అతిథిగా ప్రముఖ సైకాలజిస్టు జి.నాగేశ్వర్‌రావులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని మేధావులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

ఎస్సై కందుల అశోక్‌కు సీఐగా పదోన్నతి



వరంగల్ క్రైం, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న 2012 బ్యాచ్‌కు చెందిన కందుల అశోక్‌కు సీఐగా పదోన్నతి లభించింది. మామునూరు సమీపంలోని బొల్లికుంట గ్రామానికి చెందిన అశోక్ 2012లో ఎస్సైగా ఎంపికై ఎస్సైగా హసన్‌పర్తి, రఘునాథపల్లి, ఐనవోలు, ఇంతేజార్‌గంజ్‌లో విధులు నిర్వర్తించాడు. ప్రస్తుతం హనుమకొండ పీఎస్‌లో ఎస్సైగా కొనసాగుతుండగా పదోన్నతి వరించింది. దీంతో పోలీస్‌స్టేషన్ సిబ్బంది, 2012 బ్యాచ్‌కు చెందిన అధికారులు అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



రైలు పట్టాలపై లారీ

పై ఫొటోను చూడగానే రైలు పట్టాలపైకి లారీ వచ్చినట్లుగా కనిపిస్తోంది కదా! ఇది రైల్వే శాఖకు చెందిన 'థర్మెట్ వెల్డింగ్' వాహనం. కేసముద్రంలో కొద్దినెలలుగా మూడో రైల్వేట్రాక్ పనులు కొనసాగుతున్నాయి. రైలుపట్టాల మధ్య జాయింట్ వేసేందుకు థర్మెట్ వెల్డింగ్ పరికరాలతో కూడిన ఈ లారీని వినియోగిస్తున్నారు. ట్రాక్‌పై నడిచే హైడ్రాలిక్ ట్రాలీ వాహనంపైకి లారీ చేరగానే అమాంతం పైకి లేపి పట్టాలు జాయింట్ వేసే చోటికి తరలిస్తున్నారు. పని పూర్తయ్యాక హైడ్రాలిక్ వాహనంపై నుంచి లారీని దింపేస్తే రోడ్డుమార్గంలో లారీ మరో చోటికి తరలివెళుతోంది. రైల్వేట్రాక్, రోడ్డుపై ఉభయచరంగా ఈ వాహనం ఉండడం పలువురిని ఆకట్టుకుంటోంది.

- ఆంధ్రజ్యోతి, కేసముద్రం

వాహనదారులు మధ్యవర్తులను ఆశ్రయించొద్దు..

- వాహనాల్లో సంబంధిత పత్రాలను వెంట పెట్టుకొని ప్రయాణించాలి
- ఉమ్మడి వరంగల్ డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్టు కమిషనర్ (డీటీసీ) సురేశ్‌రెడ్డి



వరంగల్ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రవాణా శాఖ సేవల కోసం మధ్యవర్తులు ఆశ్రయించొద్దని, నేరుగా రవాణాశాఖ కార్యాలయాల్లో సంప్రదించి కావాల్సిన సేవలను పొందాలని వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్టు కమిషనర్ సురేశ్‌రెడ్డి సూచించారు. ఇటీవల డీటీసీగా బాధ్యతలు స్వీకరించిన సురేశ్‌రెడ్డి.. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కార్యాలయాలకు రాకుండానే ఇంట్లో నుంచి ఆన్‌లైన్ ద్వారా 18 రకాల సేవలు పొందేందుకు ప్రభుత్వం ఆవకాశం కల్పించిందన్నారు. అలాంటి సేవలను వాహనదారులు సమయం వృథా కాకుండా ఇంట్లో నుంచి పొందొచ్చన్నారు. ఇటీవల జరిగిన నకిలీ ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సంఘటనలో వరంగల్, హనుమకొండ కార్యాలయాలకు సంబంధించిన సిబ్బంది హస్తం ఉన్నట్లు తెలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వాహనదారులు ప్రయాణాలు చేసేటప్పుడు తప్పనిసరిగా సంబంధిత పత్రాలను వెంట తీసుకెళ్లి తనిఖీల సమయంలో బాధ్యతగా తనిఖీ అధికారికి చూపించాలని సురేష్‌రెడ్డి కోరారు. ఫిట్‌నెస్, పర్మిట్, ట్యాక్స్, ఇతర సర్టిఫికెట్‌లను విధిగా పొందాలన్నారు. పనిచేయకుండా షెడ్‌లో ఉంచే వాహనాల వివరాలను అయా యాజమానులు, ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు అందజేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పాఠశాల బస్సుల యాజమాన్యాలు, ప్రైవేట్ ట్రావెల్ బస్సుల యాజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటు చేసి నిబంధనలపై అవగాహన కల్పిస్తామన్నారు. రోడ్డు సేఫ్టీపై విద్యాలయాలల్లో దశల వారీగా అవగాహన కల్పించబోతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 18 రకాల సేవలను ఆన్‌లైన్‌లో అందిస్తుండగా మరిన్ని సేవలను ఆన్‌లైన్‌లో అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రవాణాశాఖ కార్యాలయానికి వాహనదారులు రావాల్సిన పనిలేకుండా రవాణా శాఖ సేవలు అందుబాటులోకి రాబోతున్నాయన్నారు. సేవలు పొందుటలో ఎలాంటి లోపాలు జరిగినా డీటీసీ కార్యాయలంలో తనను నేరుగా సంప్రదించి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

మన పోలీసులు దేశానికే ఆదర్శం

- సిబ్బందిలో నైపుణ్యం పెంచేందుకే పోటీలు
- డ్యూటీమీట్ ముగింపు వేడుకల్లో రాష్ట్ర డీజీపీ జితేందర్
- డ్యూటీమీట్, స్పోర్ట్స్ మీట్ పండుగ లాంటివి : జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా
- 400 మందికి బహుమతులు, పతకాల పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్



మాట్లాడుతున్న సీపీ సన్ ప్రీత్ సింగ్



డీజీపీకి సెల్యూట్ చేస్తున్న పోలీస్ జాగిలం

మామునూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాలను అదుపు చేయడంలో తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శమని డీజీపీ జితేందర్ అన్నారు. మామునూరు పీటీసీ వేదికగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం పోలీస్ డ్యూటీ మీట్-2025 పోటీల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీజీపీ జితేందర్, జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. నేర దర్యాప్తుతో పాటు అన్ని విభాగాల్లో దేశంలోనే తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో నిలవడం సంతోషదాయకమన్నారు. తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వహించే పోలీసుల్లో ఈ డ్యూటీ మీట్ పోటీలు ఉత్తేజం నింపుతాయని అన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ డ్యూటీ మీట్‌లో రాష్ట్రంలోని ఏడు జోన్లతో పాటు హైదరాబాద్, రాచకొండ కమినషరేట్ పోలీసులు, సీఐడీ, అక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సూమారు నాలుగు వందల మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి మెడల్స్ బహూకరించారు. 25 విభాగాలలో ప్రతిభ కనబర్చిన వారికి ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీని అందజేవారు. త్వరలో జరుగబోయే జాతీయ డ్యూటీమీట్ పోటీలలో సత్తా చాటి ఎక్కువ పతకాలను సాధించి తెలంగాణ పేరును నిలబెట్టాలన్నారు.

రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా మాట్లాడుతూ పోలీసులు పోలీసులకు డ్యూటీమీట్, స్పోర్ట్స్ మీట్ రెండూ పండగలాంటివని అన్నారు. త్వరలోనే జైళ్ల శాఖ విభాగంలో కూడా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందిస్తామన్నారు. ఇటీవల రాంచీలో జరిగిన ఆల్‌ఇండియా 68వ పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు అత్యుత్తమ ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా ఓవరాల్ టీమ్ చాంపియన్‌గా నిలిచి వివిధ విభాగాల్లో మొత్తం 18 పతకాలను సాధించారని అన్నారు. సైంటిఫిక్, ఇన్విస్టికేషన్, యాంటీ-సాబోటెజ్ చెక్, డాగ్‌స్క్వాడ్ పోటీ వంటి ఈవెంట్లలో తెలంగాణ బృందం ఆరు బంగారు, నాలుగు రజత, ఎనిమిది కాంస్య పతకాలను గెలుచుకుందన్నారు. ఇదే తరహాలో త్వరలో జరుగబోయే ఆల్ ఇండియా 69వ డ్యూటీ మీట్‌లో ఫోటో, వీడియోగ్రఫీ బృందాలు, డాగ్‌స్క్వాడ్ బృందాలు సత్తాచాటి ఎక్కువ మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహిళలు చేసిన నృత్యాలు, పోలీసు జాగిలాలు చేసిన విన్యాసాలు, బాణసంచా షో అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, స్నేహశబరీష్, మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, బెటాలియన్ ఎస్పీ రాంరెడ్డి, భూపాలపల్లి, మహబూబాబాద్ ఎస్పీలు కిరణ్ ఖర్గే, సుధీర్, వరంగల్ పోలీస్ కమినషరేట్ డీసీపీలు అంకిత్ కుమార్, షేక్ సలీమా, పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, కమాండెంట్‌లు, మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, ఏసీపీలు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీజీపీలను సత్కరించి జ్ఞాపికలను అందజేస్తున్న సీపీ సన్ ప్రీత్ సింగ్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీపీలు

నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హనుమకొండ గురుకులాల తనిఖీ

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బాలికల కళాశాల వసతి గృహం (ఎ), హనుమకొండ గాంధీనగర్ టీవీ టవర్ సమీపంలోని బాలుర గురుకులం(బి)లను కలెక్టర్ తనిఖీ చేశారు. గురుకులాల్లోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, వారి హాజరు శాతం అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూములోని కూరగాయలు, నిత్యావసర వస్తువులు, మెనూ చార్ట్‌ను పరిశీలించారు. వసతి గృహాలకు సంబంధించిన వివరాలను సంబంధిత హాస్టల్ వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థుల కోసం తాజా కూరగాయలను వంటలో వినియోగించాలన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఎస్సీ వెల్ఫేర్ డీడీ నిర్మల, వార్డెన్లు ఉన్నారు.



బాలసముద్రంలోని బాలికల కళాశాల వసతి గృహం (ఎ)లోని వంటశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

కాసర్ల శ్యామ్‌కు ఎర్రబెల్లి అభినందన

పాలకుర్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : బలగం సినిమాలో ... ఊరు పల్లెటూరు అనే పాటకు కేంద్రం 71వ జాతీయ ఫిల్మ్ అవార్డు ప్రకటించడం తోపాట రచయిత కాసర్ల శ్యామ్‌కు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. శ్యామ్ సమకూర్చిన ట్యూన్‌కు జాతీయ అవార్డు దక్కడంతో యావత్ తెలంగాణ ప్రజలు అభినందిస్తున్నారు. తెలంగాణ మట్టి వాసనను పాటలో రూపొందించిన శ్యామ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాష

మహా గర్జనను జయప్రదం చేయండి

● వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ పాష

నెహ్రూసెంటర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో 13న నిర్వహించే చేయూత పింఛన్‌దారుల మహాగర్జనను జయప్రదం చేయాలని వీహెచ్‌పీఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు పాష పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో శనివారం వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో మండలస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పింఛన్‌దారులకు ఇచ్చిన హామీ ఐనా దివ్యాంగులకు రూ.6 వేల పెంపును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పులి సోమయ్య, చిన్నసుబ్బారావు, ఎం.కుమార్, నారాయణ, శ్రావణ్, జలేంద్రచారి, సంద వెంకన్న, సురుగు ఐలయ్య, దాసరి సంజీవ, కందిపాటి బిక్షపతి, సంగపొంగ శ్రీను, అంజిబాబు, మణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పాతబజారులో ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నందినగర్, గుండ్లకుంట కాలనీ, ఆర్టీసీ కాలనీ, గిరిప్రసాద్‌నగర్, ఎల్‌బీజీనగర్, రాహుల్‌నగర్, చిట్యాల గోపయ్యనగర్, ఏటిగడ్డతండ, రాంచంద్రాపురం కాలనీ, ఆర్టీసీ బస్టాండ్‌రోడ్, డిగ్రీ కళాశాల, స్నేహనగర్, ఆకుల లక్ష్మయ్య కాలనీ, అంబేద్కర్ కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

● పట్టణంలోని కొత్తబజారులో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు 11కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏఈ నవ్యశ్రీ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, బీసీ కాలనీ, కొండపల్లి గోపాల్‌నగర్, మిల్ట్రీకాలనీ, ఇందిరానగర్ కాలనీ, ఎస్పీ ఆఫీస్‌రోడ్, నందమూరి, లెనిన్, బ్యాంక్ కాలనీ, సిగ్నల్ కాలనీ, ధర్మన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

'భోజనం' చార్జీలను పెంచాలి

ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు వీరేష్



మాట్లాడుతున్న ఏఐసీటీయూ జిల్లా నాయకుడు

ఇనుగుర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకనుగునంగా మెనూ చార్జీలను పెంచాలని ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు వేముల వీరేష్ డిమాండ్ చేశారు. ఇనుగుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం భోజనం కార్మికుల సమస్యలను సంఘం జిల్లా కమిటీ బాధ్యులు తెలుసుకున్నారు. జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, కోశాధికారి బొల్లోజు రాంమోహనాచారి, బుర్ర అశ్విని, కందునూరి అరుణ, నాగలక్ష్మి నవ్యశ్రీ, లక్ష్మి, స్వప్న, నాగమ్మ పాల్గొన్నారు.

జీవో 282ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

కురవి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన పనిగంటల పెంపు జీవో 282ను తక్షణమే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సావడి దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. కురవి మండలం బంచరాయి తండాలోని వాసవి టైల్స్, డెకరేటివ్ టైల్స్ ఫ్యాక్టరీలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సెక్షన్ 16, 17ను సవరణ చేస్తూ 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ జూలై 5న తీసుకువచ్చిన జీవోను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య, రెడ్డి, పద్మ, శారద పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న రఘు

కురవి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిది నెలల క్రితం డోర్నకల్ మండలం ముల్కలపల్లికి చెందిన రమేష్ అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందగా ఇన్‌స్టాగ్రామ్ రఘు వారి కుటుంబానికి దాతల సహకారంతో రూ.50 వేల నగదును శనివారం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రమేష్ గుండెపోటుతో మృతి చెందడంతో అతడి భార్య, ఇద్దరు చిన్నారులైన కుమార్తెలు దీనస్థితిలో జీవితాన్ని గడుపుతున్నారు. విషయం తెలుసుకున్న ఇన్‌స్టాగ్రామ్ గంగరబోయిన రఘు సోషల్ మీడియాలో వారి దీనస్థితిని పోస్ట్ చేశాడు. తొలుత ఆ పోస్టుకు దాతలు నిత్యావసర వస్తువులు, కొన్ని క్వింటాళ్ల బియ్యం అందించారు. అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పలువురు దాతలు రమేష్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఆ నగదును కురవి పోస్టాఫీసులో రఘు రమేష్ పెద్దకుమార్తె దీక్షిత పేరుపై డిపాజిట్ చేయించారు. ఆ బాండ్‌ను కురవి ఏఎస్సై వెంకన్న చేతుల మీదుగా శనివారం వారి కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో దుడ్డెల వినోద్, బండారి కార్తీక్, కొత్తపల్లి నవీన్, వినయ్ ఉన్నారు.

5న యూఎస్‌పీసీ ధర్నాను సక్సెస్ చేయండి

కొత్తగూడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను, బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లా కేంద్రంలో చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ నాయకుడు నెల్లుట్ల భాస్కర్ పిలుపునిచ్చారు. యూఎస్‌పీసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రకటించిన మూడు దశల పోరాట కార్యక్రమాల్లో భాగంగా శనివారం వివిధ పాఠశాలలో కరపత్రాలను జిల్లా స్టీరింగ్ నాయకుడు నెల్లుట్ల భాస్కర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడారు. హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుంటి శ్రీనివాస్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు చాట్ల పొట్టయ్య ప్రధాన కార్యదర్శి వాసం ప్రభాకర్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రాంచందర్, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు నరసింహరావు పాల్గొన్నారు.

రైతు చట్టాలపై అవగాహన ఉండాలి

● రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు సునీల్



బయ్యారంలో మాట్లాడుతున్న సునీల్

బయ్యారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : న్యాయ వ్యవస్థలో రైతు సమస్యల పరిష్కారానికి సంబంధించి దాదాపు 200 చట్టాలున్నాయని వాటిపై రైతులకు అవగాహన కలిగివుంటే లాభం చేకూరే అవకాశముందని రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు, ల్యాండ్ అండ్ అగ్రికల్చర్ అడ్వకేట్ భూమి సునిల్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలోని రైతు వేదిక నందు శనివారం లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు చట్టాలను చుట్టాలను చేయటమే లక్ష్యంగా సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, రైతు సంక్షేమ కమీషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్ రెడ్డితో కలిసి హాజరైన సునిల్ మాట్లాడారు. విత్తనం విత్తేనాటి నుంచి పంటను మార్కెట్‌కు తరలించే వరకు ఏర్పడే ప్రతీ సమస్యను న్యాయవ్యవస్థ ద్వారా పరిష్కరించుకొని లాభం పొందవచ్చన్నారు. ధరణి వల్ల పలురకాల భూ ఇబ్బందులు ఏర్పడ్డాయని పేర్కొన్న ఆయన భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ముఖ్యంగా ఏజన్సీ చట్టాలు అమలవుతున్న షెడ్యూల్డ్ ప్రాంతాల్లో తలెత్తే భూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, లీఫ్స్ సంస్థ ప్రతినిధులు గున్నా రాజేందర్ రెడ్డి, భూదాన్ బోర్డు మాజీ చైర్మన్, వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ వోఎస్‌డీ హరిప్రసాద్, ఇల్లెందు మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, న్యాయవాదులు అభిలాష్, ఆనంద్, ప్రవీణ్ రెడ్డితో పాటు వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం సాగు న్యాయ యాత్ర బృందం సభ్యులు స్థానిక తహసీల్ కార్యాలయన్ని సందర్శించి భూ రికార్డులు, భూ భారతి చట్టం గురించి రెవెన్యూ సిబ్బందికి వివరించారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల

● జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : పీఎం కిసాన్ సమ్మాన్ 20వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల శనివారం తెలిపారు. మహబూబాబాద్ రైతువేదికలో ఆన్‌లైన్ లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎం కిసాన్ సమ్మాన్ 20వ విడత నిధుల విడుదల చేసే కార్యక్రమాన్ని రైతులు, అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు 9.70 కోట్ల మంది రైతులకు రూ.20,500 కోట్ల విడుదల చేశారని చెప్పారు. జిల్లాలో గత 19వ విడతలో 64,586 మంది రైతులకు రూ.2 వేల చొప్పున విడుదల చేసినట్లు చెప్పారు. సేంద్రియ పద్ధతులను పాటిస్తూ రైతులు పంటలను సాగు చేయాలన్నారు. యూరియా వాడకాన్ని మోతాదులో మాత్రమే వేయాలని, ఎక్కువ మోతాదులో వేయడం వల్ల వాతావరణం కాలుష్యమవుతుందని, భూసారం దెబ్బతింటుందన్నారు. కేవీకే మల్యాల కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ యాంత్రీకరణ వైపే రైతులు దృష్టిసారించాలని, రైతులు బావులు, మోటార్లకు పీఎం కుసుం పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి, శాస్త్రవేత్త ఎల్.సుహాసిని, ఏఈవోలు సాయిప్రకాష్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

'బనకచర్లపై బీఆర్ఎస్ అసత్య ప్రచారం'



మాట్లాడుతున్న టీడీపీ నేత కన్వీనర్ రాంచందర్‌రావు

నెహ్రూసెంటర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఎదగవద్దనే దురుద్దేశ్యంతో బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. బనకచర్ల ప్రాజెక్టును ముందు పెట్టి ప్రాంతీయ విభేధాలు సృష్టించి తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలపడవద్దనే దురుద్దేశ్యంతో బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టుపై రెండు రాష్ట్రాల విజ్ఞాప్తులను కేంద్రం పరిశీలించి తన నిర్ణయం వెల్లడించినాక ఎవరికి రావాల్సిన వాట వారికి రానప్పుడు మాట్లాడాలే తప్ప పని గట్టుకుని బురదచల్లే ప్రయత్నం చేయొద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో సుతారపు వెంకటనారాయణ, ప్రేమ్‌చంద్‌వ్యాస్, పిట్టల రాము, బొమ్మ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు మహర్షి విద్యాలయలో కవి సమ్మేళనం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మహర్షి విద్యాలయలో ఈనెల 3న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మానుకోట రచయితల వేదిక జిల్లా కన్వీనర్ గుర్రపు సత్యనారాయణ శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకొని మానుకోట రచయితల వేదిక ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సన్నాహక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధిగా ఆంధ్ర సారస్వతి పరిషత్ చైర్మన్ డాక్టర్ గజల్ శ్రీనివాస్, ముఖ్యఅతిధులుగా ప్రముఖ పద్య గద్య కవి వెంకటరాణాప్రతాప్, డీఈవో రవీందర్‌రెడ్డి భారత వికాస్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శివరామకృష్ణ హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని కవులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వీరయ్య

మరిపెడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలో జరిగిన ఆ సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 1948 కనీస వేతన చట్టాన్ని అనుసరించి వ్యవసాయ కూలీలకు రేట్లు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని గుర్తు చేశారు. రోజుకు ప్రతీ కూలీకి రూ.800 కూలి వేతనం ఇవ్వాలన్నారు. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక లేబర్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ బాధ్యులు పెంద్ర నాగమ్మ, ఓడపల్లి వెంకటలక్ష్మి, సమ్మక్క, శాంతమ్మ, ఉపేంద్ర, ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓసీ క్లబ్‌ను స్వాధీనం చేసుకునేంత వరకు పోరాటం

● సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలో రూ.50 కోట్ల విలువ చేసే ఓసీ క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేంత వరకు పోరాటాలు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. ఓసీ క్లబ్‌ను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్‌తో చేస్తే మానుకోటలో సీపీఐ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారంతో ముగిసాయి. దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి. విజయసారథి మాట్లాడుతూ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే చొరవ చూపి ప్రభుత్వంతో మాట్లాడి ఓసీ క్లబ్‌ను స్వాధీనం చేసుకుని దానిని బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని చెప్పారు. ప్రభుత్వం, అధికారులపై ఒత్తిడ పెంచేందకు ఈనెల 4న జరుపతలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షలో మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారధిరెడ్డి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, రవి, శ్రావణ్,శంకర్, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, శ్రీనాథ్, వెంకన్న, శ్రీను, రఫీ, పద్మ, మల్లికార్జున్, సభద్ర, రాజు, శ్యాంప్రసాద్, రమేష్, మల్లయ్య కూర్చున్నారు. కాగా వినియోగదారుల మండలి బాధ్యులు షైన శ్రీనివాస్, అడ్వకేట్స్ నాయకులు మామిడాల సత్యనారాయణ, లెక్చరర్స్ ఫోరం నేత నీలం వెంకటేశ్వర్లు సంఘీభావం ప్రకటించారు

టాక్సీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

కేసముద్రం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో ఇటీవలె మృతి చెందిన టాక్సీ డ్రైవర్ కోమటిరెడ్డి రామకృష్ణారెడ్డి కుటుంబానికి కేసముద్రం మండల టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందించారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుముల మహేష్, పింగిళి సంతోష్, నాగనబోయిన నర్సయ్య, చిలువేరు గణేష్, గాడిపల్లి సంతోష్, రావుల అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక అవగాహన పెంపొందించాలి

మరిపెడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఉపాధ్యాయులు సామాజిక అవగాహన పెంపొందించాలని మరిపెడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనంతరావు అన్నారు. శనివారం మరిపెడ హైస్కూల్‌లో మరిపెడ, నర్సింహులపేట, చిన్నగూడూరు మండలాలకు చెందిన సోషల్ స్టడీస్ టీచర్లకు సబ్జెక్ట్ అవగాహనపై ప్రత్యేక శిక్షణను నిర్వహించారు. హెచ్‌ఎం అనంతరావు పాల్గొని మాట్లాడారు. రిసోర్స్ పర్సన్స్ రాంమోహన్, శాంసన్, సుధాకర్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

సాగు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



యాత్ర సదస్సులో పాల్గొని ప్రసంగిస్తున్న కోరం కనకయ్య

గార్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రభుత్వ అమలు చేస్తున్న సాగు చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గార్ల మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగిన 'సాగు న్యాయ యాత్ర' సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతితో పాటు విత్తన చట్టాలపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యం వలన రైతులకు నష్టం జరిగినప్పుడు రైతులకు మేలు జరిగే విధంగా సాగు న్యాయ సదస్సులు ఎంతో దోహద పడుతాయన్నారు. ఈ క్యాక్రమంలో సునిల్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ శారద, వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ హరిప్రసాద్ గార్ల ఏవో కావటి రామారావు, జీవన్‌రావు అభిలాష్, మల్లేశ్, ప్రవీణ్ రావు, ఏఈవోలు కిరణ్, రాజ్యలక్ష్మి, పూజిత, మేఘన, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్‌నాయక్, మాజీ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, భూక్యా నాగేశ్వరరావు అశోక్‌నాయక్, కిషన్‌నాయక్, యాకుబ్‌పాషా, బాబులాల్ నాయక్, కోలా కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదువుతేనే బంగారు భవిష్యత్తు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అవరోదం కాదని కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ పాకనాటి శ్రీలత అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరం ఎస్సెస్సీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థినులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన అరిగెల కీర్తన, సెంద్ర అనుష్క, వల్లపు చందన, రోషబోయిన రిషితలకు ప్రతి ఒక్కరికి రూ. 10 వేల చొప్పున రూ. 40 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన చెన్నూరి లహరి, గంజి సంగీతలకు ప్రతి ఒక్కరికి రూ. 7వేల చొప్పున రూ. 14 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన బండారి పూజ, పొలిశెట్టి దీప్తిలకు ప్రతి ఒక్కరికి రూ. 5 వేల చొప్పును రూ. 10 వేల నగదు అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. హెచ్‌ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయులు డాక్టర్ రమేష్, గిరిజ, శ్రీవాణి, విజయ్‌కుమార్, సంజీవ, రంజాన్ అలీ, పద్మావతి, సునిత, మంజుల, సుచిత్ర, రమాదేవి, చామంతి, కౌసల్య, రజియా, విజయలక్ష్మీ, పద్మ, మహేశ్వరి, జ్యోత్స్న, , పీవి ప్రసాద్, ఉమాదేవి పాల్గొన్నారు.



ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు నగదు అందజేస్తున్న డాక్టర్ శ్రీలత

వర్షాలతోనే మానవ మనుగడ

తొర్రూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు మానవ మనుగడకు పాటు పడతాయని వికాస్ పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేశ్ అన్నారు. శనివారం వికాస్ పాఠశాల ఆవరణలో రెయిన్ డే వేడుకలు నిర్వహించారు. వరుణుడు కరుణించి వాన కురిపించాలని కోరుతూ విద్యార్థులు ప్రత్యేకంగా ప్రార్థించారు. వారికి రంగు, రంగుల గొడుగులు, రెయిన్‌కోట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పాల్కూరికి స్మృతి వనం పరిశీలన



డీఆర్‌డీఏ ఏపీడీ నూరోద్దిన్‌కు వినతి పత్రం అందచేస్తున్న నాయకులు

పాలకుర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తొలితెలుగు విప్లకవి పాల్కూరికి సోమనాథుడు స్మృతి వనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారడంతో శనివారం డీఆర్‌డీఏ ఏపీడీ నూరోద్దిన్, ఆర్‌అండ్‌బీ డీఈ సతీష్ పరిశీలించారు. గ్రంథాలయం, గదులు మందు సీసాలతో దర్శనమివ్వడంతో విస్మయం చెందారు. వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో స్మృతివనం పరిశీలించామన్నారు. స్మృతివనంకు అప్పటి ప్రభుత్వం రూ.5కోట్లతో నిర్మిస్తే, ప్రస్తుతం అధ్వానంగా మారిందన్నారు. కలెక్టర్‌కు నివేదికను అందచేస్తామని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రం అందచేశారు.

ఒకేరోజు వరుస దొంగతనాలు

బెంబేలెత్తుతున్న పట్టణ ప్రజలు

తొర్రూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఒకే రోజు రెండు దొంగతనాలు జరగడంతో పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్న ఘటన శనివారం తొర్రూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన ఎన్.ముత్తిలింగం రిటైర్డ్ ఉద్యోగి యూనియన్ బ్యాంక్‌లో రూ. లక్ష నగదు విడిపించుకొని ఆటోలో బస్టాండ్ వెళ్తూ మధ్యలో పండ్లు కొనేందుకు ఆటోలో నగదు ఉన్న బ్యాగ్‌ను ఉంచి కిందికి దిగాడు. పండ్లు కొనునగోలు చేస్తుండగా ఆటో డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు.

తొర్రూరుకు చెందిన పున్నం హైమ అనే మహిళ హైదరాబాదులో నివాసం ఉంటోంది. ఆసరా పెన్షన్ కోసం తన కుమారుడు చంద్రతో కలిసి తొర్రూరు వచ్చింది. పెన్షన్ తీసుకొని బస్టాండ్‌కు వచ్చి బస్సు ఎక్కుతుండగా, గుర్తుతెలియని వ్యక్తి ఆమె వద్ద ఉన్న బ్యాగును దొంగతనం చేశాడు. బ్యాగులో ఉన్న రూ.20వేలు నగదు చోరీకి గురవడంతో ఆమె లబోదిబోమంటూ ఏడ్చింది. ఒకే రోజు రెండు సంఘటనలు జరగడంతో పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జరిగిన దొంగతనాలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

అమ్మా బైలెల్లినాదో..

(5వ పేజీ తరువాయి)

సున్నం రాసి, నడుమ నూనె రాసి, పసుపు కుంకుమలతో బొట్లుపెట్టి బోనాన్ని అందంగా అలంకరించుకుంటారు. కుండ చుట్టు వేపాకులు కడతారు. బోనం కుండలో వండిన పసుపు అన్నం, కుండపై చెంబులాంటి చిన్న మట్టిపాత్రను పెట్టి చింతపండు నీళ్ల ఉల్లిపాయలు లేక బెల్లం పానకం పోస్తారు. దానిపైనే కంచుడు పెట్టి అందులో దీపం పెడతారు. అమ్మవారికి నైవేద్యం పెట్టే వరకు దీపం ఆరకుండా చూసుకుంటారు. మట్టిలేక రాగిపాత్రలో ఈ నైవేద్యాన్ని వండుతారు. ముగ్గులతో అలంకరించిన ప్రదేశంలో బోనాన్ని పెడతారు. అమ్మవారికి బోనం సమర్పిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

వేడుకలకు ముస్తాబైన ఆలయాలు..

మహబూబాబాద్ కొత్తబజారు, పాత బజారులోని ముత్యాలమ్మ తల్లి ఆలయాలను బోనాల వేడుకలను పురస్కరించుకుని ఆలయాలకు రంగులు వేశారు. బోనాల సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుత్ కాంతులు వెదజల్లేలా లైట్లు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ పూజారులు, కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ట్రాలీ ఆటోను ఢీకొట్టిన బస్సు

చిలుపూర్, ఆగస్టు 2 (ఆం ధ్రజ్యోతి): వంగాలపల్లి సమీ పంలో జాతీయ రహదారిపై శనివారం పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం. వరంగల్‌కు చెందిన ఊర రాజ్‌కుమార్ తన ఆటో ట్రాలీలో కుటుంబ సభ్యులతో కలిసి కరుణాపురంలోని చర్చికి వెళ్తున్నాడు. హన్మకొండ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వంగాలపల్లి సమీపంలో ముందుగా వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. కాగా, ఆటో పాక్షికంగా దెబ్బతింది. దీంతో ఆగ్రహావేశానికి లోనైన ఆటోడ్రైవర్ రాజ్‌కుమార్ బస్సు డ్రైవర్ పురుషోత్తంపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా, బస్సు అద్దాలను పగులగొట్టాడు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై పిట్ల రాజేశ్ తెలిపారు.